అలవాటు ప్రకారం నిద్రలేవగానే సెల్ తీసుకుని ఇన్ బాక్స్ ఓపెన్ చేశాడు సురేంద్ర. అందులో ఎప్పటిలానే రామకృష్ణ పంపిన సందేశం వుంది.

“రోజూ ఓ మంచి పని చెయ్యి”

దాన్ని చూడగానే నిరాసక్తంగా ఓ నిట్టూర్పు విడుస్తూ “చూద్దాం” అనుకున్నాడు.

సురేంద్ర ఆ ఉద్యోగంలో చేరినప్పటినుంచీ ప్రతిరోజూ క్రమం తప్పకుండా అదే సందేశాన్ని పంపుతున్నాడు రామకృష్ణ. మొదట్లో దాన్ని చూడగానే ఎంతో ఉత్సాహం కలిగేది. దాని స్ఫూర్తితో ఏరోజుకారోజు “ఎలాగైనా ఈ రోజు ఏదో ఒక మంచి పని చెయ్యాలి” అని బలంగా నిర్ణయించుకునేవాడు. అందుకోసం పగలంతా శక్తి వంచన లేకుండా కృషి చేసేవాడు. అర్థరాత్రి పడుకోబోయేముందు, ఆరోజు చేసిన పనులన్నింటినీ గుర్తు చేసుకునేవాడు. వాటిల్లో ఏది మంచో ఏది చెడో బేరీజు వేసుకునేవాడు. వెలుగులో చూసిన ప్రతిదానికీ ఓ నీడ వున్నట్లే ప్రతి మంచి పనికీ చీడలా ఓ చెడు పరిణామం వుండక తప్పదనిపించేది. దాంతోబాటే మంచిపని చెయ్యడం అనేది ఎస్సెమ్మెస్ పంపినంత సులభం కాదని కూడా బోధపడేది.



ఇదేమాట రామకృష్ణతో అంటే “అంత పేరున్న దినపత్రికలో మొదటి పేజీ చూసుకునేవాడివి... ఈ మాటనడానికి సిగ్గులేదా” అంటూ మొదలుపెడతాడు.

దానికి సురేంద్ర దగ్గర జవాబులేదు. ఎందుకంటే తరచూ మంచి పనులు చేసే అవకాశాలు తమకే ఎక్కువుంటాయి. దాంతోబాటు ఆయా మంచి పనులు జరక్కుండా అడ్డుపడే ముందరి కాళ్ళబంధాలూ బెదిరింపులూ, తాయిలాలూ కూడా ఎక్కువే. దినపత్రిక అంటేనే పొద్దుట్నించీ రాత్రి వరకూ నిమిష నిమిషానికీ ప్రాధాన్యతలు మారిపోతుంటాయి. అందులోనూ మొదటిపేజీ అంటే ఆఖరి క్షణం వరకూ టెన్షనే. అది అనుభవిస్తే తప్ప అర్థం కాదు. అయినా సరే, వాటన్నింటినుంచీ తప్పించుకుని కనీసం మర్నాడయినా ఓ మంచిపని చేద్దామని నిర్ణయించుకుంటే తప్ప ఆ రాత్రి నిద్రపట్టేది కాదు.

క్రమంగా రామకృష్ణ ఎస్సెమ్మెస్ అతని పాలిట పెను సవాలుగా మారిపోయింది. యంత్రాంగం, మంత్రాగం, న్యాయాంగాలతో సమానమైన పీటయితే వుందిగానీ, ఆ పీటని పట్టుకు తిరిగేది మాత్రం కట్టుకున్న పట్టుచీరలని ఎరువిచ్చిన యజమానులే. అందుకే అక్షరాలు ఒకరివిగా అర్థాలు మరొకరివిగా మారిపోయాయి. అయినా సరే, సమాజం పట్ల సరైన బాధ్యతని నిర్వర్తించడానికి అంతకు మించిన అవకాశం మరెక్కడా వుండదు.

అందుకే బాగా ఆలోచించి ఓ మంచి పని చెయ్యడానికి శ్రీకారం చుట్టాడు సురేంద్ర.

వార్తా కథనాల్లో వాస్తవాలెంత ప్రాధాన్యతని కలిగి వుంటాయో వాటి గణాంకాలు కూడా అంతకు మించిన ప్రాధాన్యతని కలిగి వుంటాయి. ఆ లెక్కల వెనుకనున్న కథల్ని వెలికి తీయగల ఉత్సాహవంతులైన పన్నెండు మంది యువ పాత్రికేయుల్ని ఎంపిక చేశాడు. అందులో ఆరుగురు హైదరాబాద్ వాళ్ళు. ముగ్గురు చెన్నైకీ. ముగ్గురు బెంగుళూరుకీ చెందినవాళ్ళు.

వాళ్ళందరికీ చెయ్యవలసిందేమిటో వివరించాడు.

***

ఈయనొహడు నాప్రాణాలకి.... ప్రతీదానికీ గణాంకాలు కావాలంటూ బుర్రలు తింటాడు...

అదీ రైటే... లెక్కలైతే లటుక్కున పట్టుకుంటాయి. సర్లే మూడొందల ఇరవై రెండు... ఇంగ్లీషు.

పోయిన్సారి పత్తిరైతుల ఆత్మహత్యల గణాంకాలు ఫస్టుపేజీలో పెట్టాడు. ఇక్కడ ఆత్మహత్యలు పెరుగుతున్నకొద్దీ అక్కడ గవర్నమెంటుకి బీపీ రైజైపోయింది.

దటీజ్ పవర్ ఆఫ్ మీడియా...

అది ఆరేంజ్‌లో క్లిక్కవ్వడం చూసి ''హత్యా? ఆత్మహత్యా?'' అంటూ మన న్యూస్ ఛానెళ్ళన్నీ, స్పెషల్ బులెటిన్స్ స్టార్ట్ చెయ్యలేదూ? ఉన్నవీ లేనివీ కలిపి డ్రామాలు క్రియేట్ చెయ్యలేదూ? ప్రతి బులెటిన్‌నీ గుండెలు పిండేలా చిత్రించి ప్రెజెంట్ చెయ్యలేదూ?

# చైతన్య స్రవంతి

## జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి



చివరికి అవే మరికొంత మంది బలహీన మనస్కులైన రైతన్నల ఆత్మహత్యలకి దారి తీయలేదూ?

దీనిగురించి మాత్రం.. నో కామెంట్.

అరె, ఈయనెవడు....?

రాజువెడలె రవి తేజములలరగ.. అప్పుడే ఊరిమీద పడ్డారు మన ఎమ్మెల్యేగారు.

హలో బాస్, హాయిగా రియల్ సెటిల్‌మెంట్లూ గూండాగిరీ మానేసి, మనకి ఎందుకొచ్చిన ప్రజాసేవ చెప్పు...

దానికంటే ఇదే బెటరంటావా?... ఒకే!

మూడొందల ఇరవై రెండు.. ఇంగ్లీషు.

బ్లూఫాక్స్ బారెండ్ రెస్టారెంట్... వీటికేం తక్కువ లేదు.

దీన్నే తెలుగు చేస్తే...? గుంట నక్కల సారాకొట్టు మరియు కూటికొంప. మందుబాబుల భాగ్యనగరమా.. వర్ధిల్లు..

వారెవ్వా.. వాటే డైలాగ్...

రాయి రాయి... చేతికొచ్చింది రాయి.

గోబెల్సే గురువు! రీఫిల్సే ఎరువు!

ఛస్.... సైలెన్స్! లెక్క తప్పుతుంది.

మూడొందల ఇరవైనాలుగు.. ఇంగ్లీషు! మూడొందల ఇరవై అయిదూ.... ఇరవై ఆరూ... నెక్స్ట్.. గ్రీన్ హిల్స్ కాలనీ... పేరుకే గ్రీన్ హిల్స్.

నో గ్రీన్స్! నో హిల్స్!

ఉత్త కాలనీస్... కాలనీస్... కాలనీస్..ఎవరి కాలనీస్?

తెలంగాణా వాలే జాగో, ఆంధ్రావాలే భాగో... భాగమతీ వింటున్నావా? ఏమిటీ, ఆర్యులనించీ, ఆంధ్రావాలాల దాకా అం॰ ా వలస వీరులే అంటున్నావా.. జీతేరహో!

జీవితమంటే ప్రవాహగానం. గతంలోంచీ వర్తమానంలోకి అక్కడ నుంచీ భవిష్యత్తులోకీ... ఆకాశంబున నుండి శంభుని శిరంబందు ... తరవాత రాదుగానీ నా మాటమీద నమ్మకం పోతే కూసే కోయిలనడుగు, కొల్లేటి కొంగనడు , కాదంటే కొలంబస్సునడుగు. లేదంటే ఆ సిటీ బస్సునడుగు. టెలిఫోన్‌కాలనీ టు హైటెక్ సిటీ. ఇంగ్లీషునే తెలుగులో రాశారు. దీన్ని ఏ లెక్కలో వెయ్యాలో లీదు. తెంగ్లీషు.

ఎవరైనా భాగో ఇంగ్లీష ...? మనకి ఈ గణాంకాల బాధే వుండదు. ఈ మాటెవరి చెవినైనా పడితే ''ఐ నెవర్ స్పీక్ తెలుగు'' అనే మూర్ఖ పలక మెడకేస్తాడేమో!

గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్ నంబర్ టూ... దీన్ని మొహం...

అయినా ఏ వినోభా నగరం అనో పెడితే కాస్త చరిత్రయినా మిగిలేదిగా...

ఇంత పెద్ద గ్రే... టర్ హైదరాబాద్‌లో ఒక్కటైనా కొమురం గల్లీ వుందా పో విశ్వనాథవారి వీధి? పాపం, జ్ఞాన పీఠం ఎక్కినా తెలుగునాట తెలుగువారికి దక్కే గౌరవం ఇంతే. ఇంతకీ ఎన్నయ్యాయి? త్రీసిక్స్ టీసిక్స్... ఇంగ్లీష్.... ఇంగ్లీష్... ఇంగ్లీష్....

మనవాళ్ళు రాజారామ్మోహన్ రాయ్ సంస్కృతంలో చదువుకోనివ్వలేదని గోల పెడతారేగానీ కారంతేం చెప్పాడు... ''ఇంగ్లీషువాడు మనకి కావలసినంత ఇంగ్లీషు నేర్పకుండా ఇంగ్లీష్ తంత్రం ప్రయోగించడం వల్లే మన్నీ ఇంగ్లీషు వ్యామోహం పట్టుకుందీ'' అని విన్నారా?.

అందుకే ఆంగ్లద్వేషమే ఆంధ్రాభిమానంగా చెలామణీ అయ్యే దుర్గతి పట్టింది.

తెలుగు పిల్లల చేతి వెన్నముద్దల్ని పుస్సీ క్యాట్లు తన్నుకుపోతున్నాయి.

అయినా ఇంగ్లీషు చదువంటే ఏమిటి? ఇంగ్లీషు వాడిలా ఆలోచించడం నేర్పేది! శాస్త్రీయ దృక్పథం అలవాటు చేసేది! చరిత్రనించీ వర్తమానాన్ని పిండి, భవిష్యత్తుని వండేది!

అయినా మనకి చరిత్రలెక్కడున్నాయి? కావ్యాలూ, ప్రబంధాలూ తప్ప!

మన చరిత్రంతా విదేశీ య ికులు రాసిందేగా?

అంతా గందరగోళం సంతగోల! ఏం కాదు అచ్చతెలుగు పదహార



ణాల ఎంకి. పక్కనే అదిలాబాద్ రాంబాయి.

ఇద్దరూ కలసి అందానికి ఏకవచనం.

ఇంతకీ మూడొందల ఇరవై తొమ్మిదా? ముప్పయ్యా?

ఏకంగా ఇన్ని పేరు పలకల్లో పన్నెండంటే.. పన్నెండు మాత్రమే ఎలాగా? అదీ తెలుగు రాజధాని నడిబొడ్డున?

ఈ డజనులోనా ఎన్ని తెలుగు మీద అభిమానంతో రాసినవో.. ఎన్ని ఇంగ్లీషు రాక రాసినవో..

ఆహాహా... రాంబాయి.. అబ్బబ్బా ఎంకి.

వాళ్ళిద్దర్నీ ఫొటో తీస్తే అద్దిరిపోతుంది. అందానికి ప్రాంతీయతలుండవు...క్లిక్!

భలే కనిపెట్టారు... సెల్‌లో కెమెరా.. అదిగో సెల్లం గండి.. గ్రేటర్ హైదరాబాదంతే!

అటు కల్లంగళ్ళు... ఇటు సెల్లంగళ్ళు.... సయాం కమ్యూనికేషన్స్... ఇంగ్లీష్. మూడువందల ముప్పై.

ఈ సర్వే మొదలు పెట్టగానే చిరాకనిపించింది గానీ... రానురానూ ఇలా ఇంట్రస్టింగ్‌గా... ఛఛ స్వగతంలో కూడా ఇంగ్లీషు పెత్తనమే... నాన్సెన్స్...

ఈ సర్వే రిజల్ట్ మెయిన్ ఎడిషన్లో పడితే ఊపేస్తుంది. కానీ అనుమానం లేదు ఏ దిల్‌సుఖ్‌నగర్ జోన్‌లో వేస్తే వెయ్యచ్చు.

మనం ఇంగ్లీషు వాళ్ళనించి నేర్చుకున్నది ఇదొక్కటే!

విభజించు... పాలించు...

వార్తల్ని జిల్లాలవారీగా జోన్లవారీగా డివైడ్ చేద్దాం...

ప్రతీ బుర్రకీ ప్రచారం పిచ్చి పట్టిద్దాం...

బర్త్‌డేలూ, వెడ్డింగ్ లేలూ ఫారిన్ టూర్లూ రిటైర్‌మెంట్లూ ఆఖరికి తద్దినాలతో సహా దక్కిందల్లా మెక్కేద్దాం...స్థానిక పత్రికల గొంతు నొక్కేద్దాం.. కాదన్న వాడ్ని కాలికింద తొక్కేద్దాం.. ఏదో ఒకపార్టీ కొమ్ము కాద్దాం.. ఎదుటి వాళ్ల నీతి నిజాయితీల్ని నిలదీద్దాం.. మనం మాత్రం ప్యూపాల్లో దూరేద్దాం.. వార్తల్ని అంగడిసరకులా మారుద్దాం.. సమాచారాన్ని దాచేద్దాం.. సరిగ్గా సమయం చూసి శత్రువు బలహీన పడగానే దాన్నే బ్రహ్మాస్త్రంగా వాడేద్దాం.

అయినకాడికి వార్తల్ని సెంటీమీటర్ల లెక్కన అమ్మేసుకుందాం. కుదర్లేదా? అయితే పదండి ప్రముఖుల వ్యక్తి గతాలమీద సెర్చిలైట్లు వేసేద్దాం.. పుకార్లని వార్తలుగా చేద్దాం.... వాటికి వ్యాఖ్యానాలు రాసేద్దాం...

సక్రమ సంబంధానికీ అక్రమ సంబంధానికీ తేడా ఒక్క అక్షరం మాత్రమే.

పెర్సనల్ ఎఫైర్లని ప్రచారం చేద్దాం... వాళ్ళని సమాజం దృష్టిలో... వాళ్ళ బంధువుల దృష్టిలో... విరిసీ విరియని వాళ్ళ పిల్లల దృష్టిలో... దోషులుగా నిలబెడదాం... మన సొమ్మేం పోయింది?.

పెట్టు పెట్టు... కలర్ ఫుల్ హెడ్డింగులు పెట్టు.

కొట్టు కొట్టు... ఇష్టం వచ్చిన ముద్దర్లు కొట్టు.

నువ్వు చెప్పిందే వేదం.. నువ్వు చేసిందే న్యాయం.

నీత్యవినీతులు... తాతలు తాగిన నేతులు.

నువ్వు రాసిందే రాత.... గీసిందే గీత. మేష్టారూ దుమ్మెత్తి పొయ్యడం ఎలాగో తెలుసా? తెలియకపోతే వార్తా పత్రికల్ని చూసి తెలుసుకోండి. కొత్త బూతులు– కొత్త నీతులు– కొత్తరీతులు– చెత్తరాతలు. ఎక్కడైనా విలువలనేవి కనిపిస్తే గుడ్డలు ఊడదీసి మరీ కొట్టు.

ఏ విలువలూ లేక పోవడమే కదా. నేటి విలువైన విలువ?

''శ్రీనివాస ఆయుష్కర్మ శాల''

మన తెలుగు వాళ్ళతో వచ్చిన ఇబ్బందే ఇది... ఎగదీస్తే గోహత్య.. దిగదీస్తే బ్రహ్మహత్య! అయితే ఇటు ఇంగ్లీషు! లేకపోతే అటు సంస్కృతం...! ఎంచక్కా 'సవరం చేయబడును' అని పెడితే?

మనదేం పోయింది... 'మాదిగోని నెత్తి మంగలోనికత్తి లగాదేరే బత్తీ'

ఒక్క సామెత ఆవిష్కరించినంత జీవితాన్ని వంద నవలలు కూడా చిత్రించలేవు.

ఇంతకీ కత్తి గొప్పదా...? కలం గొప్పదా...?

కత్తిలా వాడే కలం గొప్పది.

ఈ మాటని మా బాలాజీ చచ్చినా ఒప్పుకోడు. పైగా సమాజాన్ని ఉద్ధరించడానికే పుట్టాం అనే భ్రమల్లోంచీ బయట పడమంటాడు. అంతేకాదు ''ఒంబర్స్ మెన్'' లా వస్తే మీ తిక్క కుదరదంటాడు. అక్కడితో ఆగడు, మొహానికి తప్ప జర్నలిస్టు మాస్కు తగిలించుకుని, నెత్తిన కిరీటం పెట్టుకొని మీసాలు తిప్పద్దు. ఆ కిరిటీం నీది కాదు, మాస్కుది అంటూ ఆరగంటైనా క్లాసు పీకుతాడు. వాడికేం తెలుసు మన ఇండియా దిగ్రేట్‌లో ఒంబర్స్‌మెన్‌లా అయినాసరే సిన్మా సెన్సార్ బోర్డులా మారిపోవలసిందే. చెప్పగలదు. కానీ, చెయ్యలేదు! చేయించలేదు! జై తెలంగాణా... ఇది పేరు పలక్కాదు... పోరు పలక, అచ్చమైన తెలుగు పౌరుషం...

నాగేటి సాళ్ళల్ల నా తెలంగాణా.. నా తెలంగాణా..

ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్‌కి సెకెండ్ స్టేట్....

ఇండియన్ కోడలైన ఇటాలియిన్ పుట్టినరోజు కానుక...

రామస్య రామయోః రామాణాం...

సోనస్య సోన్యోః సోన్యాణాం...

ఎంతపోరాడి ఎన్ని సాధించుకున్నా...

బానిసలు బానిసలే.. బానిసదొరతనం మొదలవుతుంది... దొరలు మారినా దొరతనాలు మారవు...

ఎందుకు మారవు?... ఛేంజ్ ఈజ్ ఎటర్నల్... మళ్ళీ ఇంగ్లీషు... ఛత్....

ఏదేమైనా తాంబూలాలిచ్చేశారు. సోదర సోదరీ మణులారా తన్నుకుచద్దాం రండి.

అదిగో బండమైసమ్మ గుడి. మైసమ్మంటే జంటనగరాలని పచ్చగా చూసే చల్లని తల్లి. అంబారీలు పల్లకీలు జట్కాలు సైకిల్ రిక్షాలనించీ సెవెన్‌సీటర్ల దాకా... ట్రంకాల్స్ నించీ ఎస్టీడీ బూతులూ, పేజర్లు, కెమెరా సెల్లుల దాకా ప్రతీ మార్పుకీ మౌన సాక్షి. చూడ్డం చేతవ్వాలేగానీ ఆ వెండి కళ్ళ వెనుక లెక్కలేనన్ని సాలార్ జంగ్ మ్యూజియాలు.

అమ్మా మైసమ్మ తల్లీ నిన్ను పాటలకెక్కించీ పోస్టర్లకి ఎక్కించీ ఆగం ఆగం చేస్తున్న అగంతుకులందర్నీ క్షమించు!

అర్రె... ఇన్నాళ్ళూ గమనించలేదుగానీ... దీని పేరుపలక తెలుగు అక్షరాల్లోనే వుంది గానీ తెలుక్కాదు... ''బండమైసమ్మా టెంపుల్'' ఇటు ఇంగ్లీషు కాదు అటు తెలుగూ కాదు తెంగ్లీషు.. అయాం సారీ మైసమ్మా. నెక్స్?

ఆహా... కేఫ్ లవ్ బర్డ్స్..

గరం గరం ఇరానీ చాయ్.. గరం గరం హైదరాబాదీ భాయ్

గరం గరం నగరం.. మింగలేని నగరళం.. గళం గళం... నగరళం...

స్టైల్స్ ఫాషన్స్... తెలుగునే ఇంగ్లీషులో రాసుకుంటూ–– తెలుగునే ఇంగ్లీషు యాసలో పలుకుతూ.. ర్యాంపుల మీద లయలూ హొయలూ నయగారాలూ.. వైవిధ్యానికి కొదవ లేదు 'వైరుధ్యాలకీ కొదవలేదు'. అయినా సరే పరస్పరం కలుసుకుంటూ తెలుసుకుంటూ హంగు పొంగులు పంచుకుంటూ ఏడురంగుల ధవళ కాంతులు పరుచుకుంటూ... మన భాగ్యనగరం! సౌభాగ్యనగరం.

ఉన్నట్టుండి ఏ మూఢాచారమో పడగ విప్పుతుంది! ఏ అంధ విశ్వాసమో రంకె వేస్తుంది! ఏ జిలెటిన్ స్టిక్కో భాగమతి గుండెల్లో పేలుతుంది...

అయినా సరే తొణకదు! బెణకదు!

గరం గరంగా నగరం... గరం గరంగా.. రంగా రంగా

అదేంటి రంగా?

నా సామి రంగా.. ఏంటా సడెన్ బ్రేకు?

సుమోలోంచి దిగుతున్నాడు.. ఎవడో 'సుమో' లాగే ఉన్నాడు...

అర్రె... మన ఎమ్మెల్యేనే!


సరిగ్గా సుమోలాగే.. ఎన్నడా పట్టా కత్తి భైరవన్?

ఈ ఎమ్మెల్యేకి వేట కొడవళ్లతో ఏం పని...

సెల్ తియ్యి... స్టార్ట్ కెమెరా..

క్లిక్.. క్లిక్... అదేంటి గొర్రె? క్లిక్.

ఆ పసువు కుంకాలేంటీ వేప మండలేంటీ.. క్లిక్.. క్లిక్..క్లిక్...



క్లిక్ క్లిక్ కస్సక్.. తెగింది మెడ.. జూమ్...జూమ్... మెడమీద...

గిల గిలా కొట్టుకుంటూ బ్బే...బ్బే...మ్బే...

మ్యిగ్గాడ్...కలం కంటే కత్తే గొప్పది...

భవిష్యత్తు పలుకుతూ గొర్రెతల...క్లిక్ క్లిక్.... పలికిస్తూ ఎమ్మెల్యే!

కాసేపు అక్కడే వుంటే.. మన ఫోటోల సంగతి తెలిసిందంటే...

మన తలా పలుకుతుంది.. భవిష్యత్తు!

ఆ బలి చక్రవర్తులకి ఏ డౌటూ రాక ముందే... ఎస్కేప్...

కంట్రోల్ యువర్ సెల్ఫ్... నో రన్నింగ్.. జస్ట్ వాకింగ్...

కూల్ కూల్... నో కంగార్స్! నో వణుక్స్!

కూల్ వాకింగ్... కామ్ గోయింగ్.. నైస్ ఎస్కేపింగ్... మైసమ్మతల్లీ వాళ్ళ కంట పడకుండా కాపాడమ్మా పొంగళ్ళు పెడతా! పట్టు చీరలిస్తా!!

ఆ వెనకాల వచ్చేవాడు పీకట్టుకుంటే?

అమ్మా తల్లీ కోణ్ణి కోస్తా ఈ గండం గడుపు!!!

హమ్మయ్య దాటిపోయాడు! హమ్మయ్య సందు తిరిగాం! హమ్మయ్యయ్య, నో ప్రాబ్లం.

ఈ ఎమ్మెల్యే సామాన్యుడు కాదు! మన పేపర్లో మహామాన్యుడు!

రాజువెడలె రవి తేజములలరగ....

ఇందుకన్న మాట!

ఈ ఫోటో రేపు పేపర్లో పడాలీ... కుడి ఎడమల డాల్ కత్తులు మెరయగ... అయినా వేసేదెవడు? ఆ ఎమ్మెల్యే ఎవరో కాదు. మన ఎమ్డీగారికి రైటు హేండు. ఈ ఫోటోలు చూస్తే ఏమంటాడు? ''ఆ... ఏముందయ్యా.. మొక్కుకున్నాడు! ఆ మొక్కు తీర్చుకున్నాడు! ఇదీ వార్తేనా? ఎవడ్రా పంపించిన యెదవ? అంటూ మొదలెడతాడు.

పట్టపగలు.. నడిరోడ్డుమీద... చట్టాలు చెయ్యాల్సిన వాడే చట్టాన్ని అతిక్రమిస్తే... అది వార్త కెదా? ఎందుక్కాదు? సెన్సేషనల్ న్యూస్! అయినా వేసేదెవడు?

ఎమ్డీలు ఎలక్షన్ న్యూస్ అమ్ముకున్నట్టు.. ఈ ఫోటోల్తోనే బేరం పెడితే?

ఛీఛీ... చెప్పేవి శ్రీరంగనీతులూ... దూరేవి...

ఇదన్నమాట అసలు సంగతి....

ఎవడైనా అవకాశవాదిగా మారలేదూ అంటే... అందుక్కారణం వాడికి అవకాశం కలిసి రాకపోవడమే.. సీతలాంటిది అందమైన ఆవకాశం చేతిలో వున్నా కొన గోటితో కూడా తాకలేదంటే.. రావణా ఈజ్ గ్రేట్ నమ్మిన విలువల్ని కాపాడుకోవడం ఆయన్ని చూసి నేర్చుకోవాలి.

ఓం దశకంఠాయనమః కర్ణాటకలో ఎక్కడో రావణాలయం వుందట... వెళ్ళి పూజించుకు రావాలి.

అయినా నడిరోడ్డుమీద విలువల్ని నిలువునా బలిస్తూంటే నిలదీసే ధైర్యం తేదుగానీ ఫోటోల్తో బేరం పెడతాట్ట. దమ్ముందా? హూc!!!

ఈ ఎమ్మెల్యేకి మంత్రి పదవి రావడం కోసం ఆయన్ని సెంటీమీటర్ల చొప్పున తూకం వేసి ఉన్నవీ లేనివీ కల్పించి మరీ గాల్లో కెత్తుతున్న పత్రిక మన్ది. ఈ ఫోటోని వేస్తుందా? ఖచ్చితంగా వేస్తుంది...

పేపర్లో కాదు.... చెత్తబుట్టలో!!!

పోనీ ఎగస్పార్టీ పేపరుకి పంపితే?

డబ్బెవరికి చేదు? మనం పెట్టలేని బేరం వాడు పెట్టుకుంటాడు. ఎందుకంటే.. ఎందుకైతే ఎందుగ్గానీ.. ముందీ ఫోటోలు గురువుగారికి మెయిల్ చేద్దాం.

తెగులు బోర్డులూ ఇంగ్లీషు బోర్డులూ తెంగ్లీషు పలకలూ ఇంగిలుగు పలకలూ లెక్కపెట్టుకు రమ్మంటే ఈ ఫోటోల గోలేంటని బండబూతులు తిడతాడు. తిడితే తిట్టుకోనీ.

***

దాదాపుగా గణాంకాలన్నీ వచ్చేశాయి... ఒక్కటి తప్ప ! వచ్చిన గణాంకాలని పరిశీలించడం మొదలు పెట్టాడు సురేంద్ర.... వాటిని చూస్తుంటే అతను అనుకున్న దానికంటే ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి.

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నగరం చెన్నై. అక్కడ ప్రతీ చదరపు కిలోమీటరులోనూ తొంభై తొమ్మిది శాతం తమిళ బోర్డులే. అరవై శాతం ఇంగ్లీషులో కూడా ఉన్నాయి. కేవలం ఒక్కటంటే ఒక్కశాతం మాత్రమే పూర్తి ఇంగ్లీషు బోర్డులు. ప్రతి నామ ఫలకమూ అక్కడి ప్రజల అవసరాలకు అనుగుణంగా రాయడం జరుగుతుంది. కాబట్టి అది ఒక విధంగా ఆ ప్రాంతంలోని వారి మనోభావాలకి ఆత్మాభిమానానికీ అద్దం పడుతుంది. ఖచ్చితంగా తమిళుల నించీ ఆంధ్రులు నేర్చుకోవలసింది ఎంతో వుంది. ముఖ్యంగా ఏకత్వం!

బెంగుళూరు పరిస్థితి కొంత భిన్నంగా వుంది. తొంభై శాతం కన్నడం. అందులో డబ్భైశాతం ఇంగ్లీషు. మరో ఇరవై శాతం తమిళ తెలుగు మలయాళాలు. కన్నడిగుల నించి తెలుగువారు నేర్చుకోవలసింది చాలా వుంది. ముఖ్యంగా భిన్నత్వంలో ఏకత్వం!!

హైదరాబాదే మరీ విపరీతం. తొంభై అయిదు శాతం ఇంగ్లీషు. అందులో నలభై శాతం మాత్రమే తెలుగులో కూడా రాశారు. ఉత్త తెలుగు నామ ఫలకాలు అయిదంటే అయిదు శాతం మాత్రమే. పాత బస్తీయే నయం ఎనభైశాతం ఉర్దూ కనపడుతోంది.

వాటిని చూడగానే సురేంద్రకి కడుపు రగిలిపోయింది. అందుకే తనింక ఊరుకోకూడదని తీర్మానించుకున్నాడు. తెలుగు గురించి తను పాఠకుల చెప్పులో రాయిలా.. చెవిలో జోరీగలా.. పాలకుల కంటినలుసుగా.. కాలిముల్లుగా తయారవ్వాలనుకున్నాడు. రోజూ ప్రాంతాలవారీగా ఇంగ్లీషు తెలుగు బోర్డుల సంఖ్యని మొదటి పేజీలో పెట్టాలనుకున్నాడు సురేంద్ర. రామకృష్ణ ఎస్సెమ్మెస్ తనని వేటాడినట్టుగానే, తనూ పాఠకుల్ని వెంటాడాలని నిర్ణయించుకున్నాడు. ప్రతి రోజూ పేపర్లో రావాలే గానీ దాన్ని ఎవరో ఒకరు చూడక పోరు ఎవరో ఒకరు దాని గురించి ఆలోచించకపోరు.'' అనుకుంటూ అంతవరకూ వచ్చిన గణాంకాల ఆధారంగా ఎమ్డీగారికి పంపడానికి నివేదిక సిద్ధం చెయ్యడం మొదలుపెట్టాడు సురేంద్ర.

అంతలోనే చివరి ఈమెయిల్ కూడా వచ్చింది. అది సామాన్యమైన వార్త కాదు. దాన్ని చూడగానే సురేంద్ర దృష్టిలో ప్రాధాన్యతలు మారిపోయాయి. తన నిస్సహాయతకి తనని తానే నిందించుకుంటూనే బాధ్యత కలిగిన పాత్రికేయుడిగా స్పందించాడు. అందుకే, దాన్ని చూడగానే తెలుగు భాషా ప్రాధాన్యతని పెంచడానికై మొదటి పేజీలో ఒకటిరెండు సెంటీమీటర్ల స్థలం కేటాయించమని అభ్యర్థిస్తూ రాస్తున్న రిపోర్టుని పక్కన పెట్టాడు.

వెంటనే ఈమెయిల్ మీద దృష్టి సారించాడు. అందులో గణాంకాలు లేవు. ఓ ఎమ్మెల్యే జంతు బలిస్తున్న ఛాయా చిత్రం వుంది. అదీ నగరం నడిబొడ్డున. అది గనక ఎమ్డీగారి కంటపడితే న్యూస్ కిల్లయిపోతుంది.

అందుకే అతనిప్పుడు ఆ ఎమ్మెల్యేకి తనపత్రికలో వున్న పలుకుబడి గురించి ఆలోచించట్లేదు.

ఆయన తలచుకుంటే మరుక్షణమే తన భార్యాపిల్లలు వీధిన పడతారన్న విషయం ఆలోచించట్లేదు.

మరీ ముఖ్యంగా ఆయన రియల్ ఎస్టేట్ వ్యవహారంలో లొసుగుల్ని బయట పెట్టిన స్ట్రింగర్‌కి ఏక్సిడెంటయిన విషం గురించి ఆలోచించట్లేదు.

చివరికి రామకృష్ణ ఎస్సెమ్మెస్ గురించి కూడా ఆలోచించట్లేదు.

అతను ఆలోచిస్తున్నది ఒక్కటే...

ఆ ఫోటోకి సంబంధించిన వార్త రాయడం గురించి.

❑

రచయిత సెల్ నెం: 9440037258



## నాజూకుదనంలో నమిత

నిన్న మొన్నటి వరకూ నా భారీ అందాలే నాకున్న ఏకైక ఆస్తి అంటూ తెగ కబుర్లు చెప్పిన నమిత ఇప్పుడు రూటు మార్చింది. మూడు నెలల కాలంలో ఏకంగా 20కిలోల బరువు తగ్గిందట! 'సింహా' షూటింగ్ సమయంలో ఓ 'సన్నిహితుడు' ఇచ్చిన సలహాను తూ.చా. పాటించి నమిత బరువు తగ్గిందని టాలీవుడ్ జనాలు గుసగుసలాడుతున్నారు. అయితే అవన్నీ అబద్ధాలేననీ, తనకెవరూ సలహాలూ సూచనలు ఇవ్వలేదని నమిత కొట్టి పారేస్తోంది. ఊబకాయంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్లు సలహా మేరకే బరువు తగ్గుతున్నాని చెప్పింది.